క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

గణాధిపతికి పూజలు



వినాయకుడికి సహస్ర దీపాలంకరణ

శ్రీశైలం: దేవస్థానం ఉద్యోగ సిబ్బంది వసతిగృహాల వద్ద ఏర్పాటు చేసుకున్న వినాయకునికి మంగళవారం రాత్రి ప్రత్యేకంగా తయారు చేసిన ఊయలలో గణనాథులను వేంచేయింపజేసి ఊయల సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే క్షేత్రపరిధిలోని మల్లికార్జున కల్యాణ మండపంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి సహస్రదీపాలంకరణ శోభతో మండప ప్రాంగణం కళకళలాడింది. శివలింగాకృతి, ఓంకారం, త్రిశూలం, ఢమరుకం రూపాలలో సహస్ర ప్రమిదలను వెలిగించారు.

సకాలంలో విధులకు హాజరవ్వాలి



బొల్లవరం గ్రామసచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని బొల్లవరం గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాంతారెడ్డి, భూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక




చిన్న కార్తిక్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ షేక్షావలి

నందికొట్కూరు: రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెరికల్చర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షేక్షావలి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి చిన్న కార్తిక్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న కర్నూలులోని స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పాములపాడు: డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్లందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నావారెందరో ఉన్నారన్నారు. ఓవర్ లోడ్ పేరుతో ఫైన్లు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఐటీయూ నాయకులు రామ్ నాయక్, రణధీర్, ఆటో కార్మిక సంఘం నాయకులు పరమేష్, శ్రీను పాల్గొన్నారు.

ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ



ఎంపికైన ఎన్‌సీసీ క్యాడర్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నూతన ఎన్‌సీసీ క్యాడర్‌ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా నిర్వహించి కార్యక్రమంలో 28(ఎ)డి.ఎన్ ఎన్‌సీసీ కర్నూలుకు చెందిన ఉదయ ప్రకాష్‌చౌటే మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎన్‌సీసీ చేరడం వలన శారీరక ధృడత్వం తో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం కూడా ఉందన్నారు. నూతన ఎన్‌సీసీ క్యాంపు ఏర్పాటు చేయడం పట్ల కళాశాల ప్రిన్సిపల్, టీపీఓ శివరాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మొక్కజొన్న.. ఖుషీగా రైతన్న

- మద్దతు ధర కంటే మార్కెట్ రేటు అధికం
- క్వింటా రూ.2,200పైనే
- ఇంకా పెరిగే అవకాశం
- దిగుబడి తగ్గినా.. మంచి ధర ఉండటంతో రైతన్నకు ఊరట



మొక్కజొన్న ధాన్యాన్ని బస్తాల్లో నింపిన రైతన్నలు

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో విస్తారంగా మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి వస్తోంది. రైతులు మొక్కజొన్న పంటను కోత కోసి ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1970 ఉండగా, మార్కెట్ ధర అధికంగా క్వింటాల్‌కు రూ.2,200 లకు పైగా పలకవడంతో రైతులు ఖుషీగా ఉన్నారు.

20,300 హెక్టార్లలో సాగు..

శ్రీశైలం నియోజకవర్గంలో మొక్కజొన్న సాగు పరిశీలిస్తే దాదాపు 20,300 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం రైతులు కోత కోస్తున్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో వర్షాభావ పరిస్థితుల వలన దిగుబడి కొంత మేర తగ్గింది. ఆగస్టు నెలలో పూర్తిగా వర్షాలు స్తంభన కావడంతో పంట పిందె దశలో ఎండే పరిస్థితి ఏర్పడింది. దీంతో దిగుబడి తగ్గడమే కాక పంట ఏపుగా పెరగకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. పాములపాలు, కొత్తపల్లి మండలాల్లో వర్షాభావ పరిస్థితుల వలన పంట దెబ్బతినగా 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. అయితే మద్దతు ధర ఉండడం వలన దిగుబడి కాస్త తగ్గినా రైతులకు ఊరట లభిస్తోంది.

ఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో అధిక దిగుబడులు

ఆత్మకూరు మండలంలోని వరదరాజస్వామి ప్రాజెక్ట్, సిద్ధాపురం చెరువు , వెలుగోడు మండలంలో కేసీ కెనాల్, తెలుగు గంగ కాలువల ద్వారా పంటలకు నీరందడంతో రైతులు అధిక దిగుబడి సాధించారు. ఎకరాకు 20 నుంచి 30 బస్తాలు దాకా పంట రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రబీలో కూడా మొక్కజొన్నవైపే మొగ్గు ..

ఖరీఫ్‌లో పంట వర్షాభావ పరిస్థితులు, వాతావరణం అనుకూలించకపోయినా ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు రబీలో కూడా మొక్కజొన్న సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే ట్రాక్టర్ల ద్వారా సేద్యాలు చేస్తూ పొలాలు చదును చేస్తున్నారు. వరుసగా ఐదారు సంవత్సరాలు మినుము పంట సాగు చేసిన రైతులకు దిగుబడులు నిరాశపరచడంతో వారు కూడా మొక్కజొన్న లాభసాటి పంటగా భావించి సాగుకు ఉపక్రమిస్తున్నారు.

ధర అధికంగా ఉండడంతో మేలు జరిగింది



ఈ ఏడాది ఖరీఫ్ లో సాగు చేసిన మొక్కజొన్న పంట వర్షాల వలన కొంత దెబ్బతింది. అయితే బోరుబావులు, చెరులు కింద దిగుబడులు అధికంగా వచ్చాయి. దీనికి తోడు మద్దతు ధర కంటే మార్కెట్ ధర అధికంగా ఉండడం వలన పంట సాగు చేసిన రైతులకు కొంత ఊరటనిచ్చింది. క్వింటాల్ ధర రూ.2 వేలకు పైగా ఉండడంతో రైతులు సంబరపడుతున్నారు. ఇంకా పెరిగే అవకావం ఉంది. - దినకర్, కరివేన

మినుము కంటే మొక్కజొన్నే మేలు



ఖరీఫ్ సీజన్ ముగిసింది. మొక్కజొన్న సాగు చేసిన రైతులు రబీలో మినుము, వేరుశనగ పంటలపై మొగ్గు చూపారు. అయితే ఈ ఏడాది మినుము కంటే మొక్కజొన్న పంటే మేలని భావిస్తున్నాం. రెండు మూడేళ్లుగా మినుము రైతులు సాగు చేసినప్పటికీ తెగుళ్ల వలన పంట దిగుబడి తగ్గడంతో చాలా నష్టపోయాం. దీంతో రబీలో కూడా మొక్కజొన్న వైపే రైతులు దృష్టి సారించారు.
- అబ్దుల్‌కలాం, ఆత్మకూరు

సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు

పాములపాడు: మండల కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కార్యాలయం వదరకు సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం ఏఓ ఫణీశ్వర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జుబేర్‌తోలతో కలిసి మట్టి రోడ్డును పరిశీలించారు. నిత్యం రైతులు ఇక్కడకు వస్తుంటారని, వాహనాలు సైతం ఎరువులు, విత్తనాలు స్టాకు దించేందుకు వస్తుంటాయని, వర్షాకాలంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని ఏఓ తెలియజేశారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ సీసీ రోడ్డు నిర్మానానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కళాకారులను ఆదరించాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం దేశంలోని కళాకారులను ఆదరించాలని ప్రజా నాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో మంగళవారం నంద్యాల జిల్లా ప్రజా నాట్య మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాకారులకు పింఛన్ నెలకు రూ.5 వేల చొప్పున మంజూరు చేశారని, సచివాలయాల్లో దరఖాస్తు తీసుకుని వెళ్తే ఇందులో ఆప్షన్ లేదని సచివాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారన్నారు. కళాకారులు పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే విధంగా ఆప్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పురుషోత్తం, సుధాకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్చాలి



ప్రజా ప్రతినిధులతో సమావేశమైన ఆర్డీఓ దాసు

నందికొట్కూరు రూరల్ : నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని ఆర్డీఓ దాసు అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలా మంది యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ముందుకు రావడంలేదని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల వివరాలతో పాటు మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, నూతన ఓటర్లు ఎవరైనా ఉన్నారో గుర్తిస్తే తమకు వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎలక్షన్ డీటీ కిషోర్, కౌన్సిలర్ మండడివాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పిస్తున్న రజక సంఘం నాయకులు

జూపాడుబంగ్లా: భూమికోసం రజాకార్లపై పోరాటం చేసిన ధీరవనిత రజక ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని రజకులు అభివృద్ధి పథంలో నడవాలని రాష్ట్ర రజక సంక్షేమ సంఘం నాయకుడు బస్తిపాటి మౌలాలి అన్నారు. మంగళవారం రజక ఐలమ్మ 128 జయంతిని సర్పంచ్ బాలయ్య, ఎంపీటీసీ కృపాకర్ అధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె సేవలను స్మరించుకున్నారు. అనంతరం రజక సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కడుమూరు ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా బండ్ల రవికుమార్, ప్రచార కార్యదర్శిగా నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు, గోకారమయ్య సహాయ కార్యదర్శిగా గోపాలు, ఎల్లయ్య, కోశాధికారిగా రాజశేఖర్ ఎంపికచేశారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

మండలకేంద్రంలో రజక ఐలయ్య విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మండల రజక సంక్షేమ సంఘం నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన రజకులు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో మంగళవారం నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ మాణిక్యమ్మ, జేఏసీ కన్వీనర్ సుల్తాన్, సింగల్‌విండో చైర్మన్ సురేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేపట్టిన గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు కాలనీల్లో నూతన విద్యుత్ స్తంభాలు వేయాలని గ్రామ ప్రజలు విన్నవించారన్నారు. ఎమ్మెల్యే స్పందించి ట్రాన్స్ కో అధికారులను నూతన విద్యుత్‌స్తంభాలు వేయాలని ఆదేశించారన్నారు. ప్రస్తుతం గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన కొత్త స్తంభాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో రికవరీ చేయండి



దుర్వినియోగంపై విచారణ చేస్తున్న జేపీఎం శ్రీనివాసులు

మహానంది: మహానంది మండలంలోని పలు పొదుపు సంఘాలలో దుర్వినియోగమైన బకాయి వసూళ్లను మూడు నెలల్లో రికవరీ చేయాలని సెర్ప్ జూనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. బుక్కాపురంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం రికార్డులు పరిశీలించారు. జేఆర్‌పీ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గాజులపల్లెలోని సూర్యగ్రూపులో రూ. 2.30లక్షలు, తమ్మడపల్లె నవోదయ గ్రూపులో రూ. 6.30లక్షలు, గాజులపల్లె ఆర్ఎస్‌లోని ఆదర్శ గ్రూపులో రూ. 58వేలు, తిమ్మాపురం మధుర గ్రూపులో రూ. 78వేలు దుర్వినియోగమైనట్లు గుర్తించామన్నారు. వీటన్నింటిని మూడునెలల్లోగా రికవరీ చేయాలన్నారు.

చెంచులక్ష్మి మహాసమాఖ్య సమావేశం



పొదుపు మహిళలతో సమావేశమైన పీఓ

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచుగిరిజన మహిళలకు సంబంధించి ఏర్పాటైన చెంచులక్ష్మి మహాసమాఖ్య జిల్లా సమావేశాన్ని మంగళవారం సున్నిపెంటలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి. రవీంద్రారెడ్డి సమావేశమై పొదుపు సంఘాల వివరాలను తెలుసుకున్నారు. సక్రమంగా నడవని పొదుపు సంఘాలను గాడిన పెట్టాలని వైకెపీ అధికారులను ఆయన ఆదేశించారు. చెంచు గిరిజనులకు ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా ఆధార్ కార్డులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మహానంది, అహోబిలం, ఆత్మకూరు, దోర్నాల, మాచర్ల , ఎర్రగొండపాలెం, శ్రీశైలం ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులను కొనాలన్నారు. సమావేశంలో ఏపీడీ కేజీ నాయక్, ఏపీఎం సత్యనారాయణ, షేక్ జోహార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న కో ఆప్షన్‌సభ్యులు

ఆత్మకూరు: క్రీడాకారులు క్రీడల్లో రాణించి మంచిపేరు తేవాలని మున్సిపల్ కో ఆప్షన్‌సభ్యులు రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం స్కూల్‌గేమ్ అండర్-14 , అండర్-17 బాలబాలికల క్రీడాపోటీలు ప్రారంభించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుమునుపు కో ఆప్షన్‌సభ్యులు రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్‌లను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీ దేవానందం, శంకర్, సుదర్శన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

38 పాఠశాలలకు క్రీడాపరికరాలు

జూపాడుబంగ్లా: ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడాపరికరాలు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 ప్రాథమికోన్నత పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 8 ఉన్నత పాఠశాలలకు క్రీడాపరికరాలు మంజూరైనట్లు తెలిపారు.

రక్తదానం

నందికొట్కూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని పటేల్ సెంటర్‌లో బీజేవైఎం జిల్లా నాయకులు శివప్రాదరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు గూడూరు రవికుమార్‌రెడ్డి మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు రక్తదానం చేశారు. చిన్న సుంకన్న, కిరణ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీపీఆర్ వ్యాక్సిన్ వేయించండి

కొత్తపల్లి: మండలంలోని జీవాలకు తప్పకుండా పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలని పశువైద్యాధికారి భువనేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని శివపురం గ్రామంలో గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు 50 శాతం వ్యాక్సినేషన్ పూర్తయ్యిందన్నారు. ఈ వ్యాక్సిన్ 3 నెలలు పైబడిన జీవాలకు మాత్రమే వేస్తామన్నారు.

పేద విద్యార్థుల చదువుకు అధ్యాపకుడి చేయూత



ప్రిన్సిపాల్ నగదు అందజేస్తున్న సయ్యద్‌బాబు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఆ కళాశాల జువాలజీ అధ్యాపకుడు సయ్యద్‌బాబు చేయూత నందిస్తున్నారు. ఆర్థిక స్థోమతలేని విద్యార్థులకు సంబంధించిన ఫీజు చెల్లించేందుకు నగదును మంగళవారం ప్రిన్సిపాల్ ఘురామాచార్యులుకు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడు సయ్యద్‌బాబు 2021 నుంచి ప్రతి ఏటా నిరుపేద విద్యార్థుల కళాశాల ఫీజుల కింద రూ.11 వేలను చెల్లిస్తున్నారని చెప్పారు. అలాగే నిరుపేద విద్యార్థి కరిష్మా ఇంజినీరింగ్ చదువుకునేందుకు స్థోమత లేకపోవడంతో రూ.25 వేల ఆర్థిక సాయం అందించారని తెలిపారు.

రాయితీ శనగ విత్తనాల పంపిణీ

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం తరిగోపుల గ్రామ సచివాలయం వద్ద రైతులకు రబీ సీజన్‌కుగాను రాయితీ శనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్బీకే వీఏఏ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల ధర్నా

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. అలాగే ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఖాజావలి, అచ్చెన్న, ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా హౌసింగ్ అధికారి వెంకటసుబ్బయ్య

నందికొట్కూరు: జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. మంగళవారం పట్టణ సమీపంలోని జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సిమెంట్, ఇసుక, స్టీల్, ఇతర సామగ్రి తక్కువ ధరకే ప్రభుత్వం సరఫరా చేస్తుందని చెప్పారు. ఇళ్లులేని ప్రతి పేదవాడు ఇంటిని నిర్మించుకునేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 6,969 మందికి జగనన్న లే అవుట్లలో ఇంటి స్థలంతో పాటు పక్కా గృహాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 2,388 ఇంటి నిర్మాణాలు పూర్తి చేసినట్లు చెప్పారు. అనంతరం పట్టణంలోని జైకిసాన్ పార్కులో సచివాలయం హౌసింగ్ ఉద్యోగులతో సమావేశమయ్యారు. హౌసింగ్ ఈఈ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో జగనన్న పక్కాగృహాలు వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్‌పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్, ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సుబ్బారెడ్డి, డీఈ సుంకిరెడ్డి, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పీఎంఎఫ్‌ఎంఈ లబ్ధిదారులకు శిక్షణ



లబ్ధిదారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమతో సంఘటిత రంగంలోని పెద్ద వ్యాపారస్తులకు దీటుగా ఎదిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా ఫుడ్ ప్రాసెసింగ్ ఈడీ యూ.నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో పీఎంఎఫ్ఎంఈ లబ్ధిదారులు, డీఆర్పీలకు మార్కెటింగ్, బ్రాండింగ్, సాంకేతికత, ఫైనాన్స్ అంశాలపై జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...పీఎంఎఫ్ఎంఈ పథకంలో భాగంగా వ్యాపారాభివృద్ధికి అయ్యే వ్యయంలో 10 శాతం మాత్రమే లబ్ధిదారుడి వాటాగా ఉంటుందని, బ్యాంకు ద్వారా 90 శాతం రుణ సౌకర్యం కల్పిస్తూ, 35 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.కార్యక్రమంలో డీఆర్పీలుచరణ్,మద్దిలేటి, రవికుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



ముఖ్యమంత్రికి కతజ్ఞతలు తెలుపుతున్న బేడ బుడగ జంగాల నాయకులు

వెలుగోడు: రాష్ట్రం బేడ బుడగ జంగాల అభ్యున్నతికి జేసీ శర్మ కమిషన్ అందించిన నివేదికను అసెంబ్లీలో ఆమోదం తెలిపి, కేంద్రానికి పంపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు బేడా బుడగ జంగం సంఘం కతజ్ఞతలు తెలిపింది. మంగళవారం స్థానిక సీపీ నగర్ కాలనీలో బేడ బుడగ జంగాల సమావేశం జరిగింది. సంఘం మండల అధ్యక్షుడు చిత్తారి మల్లికార్జున మాట్లాడుతూ.. రాష్ట్రంలో బేడ బుడగ జంగాలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో చదువుకు దూరమై, యాచక వత్తి చేసుకుంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు.

ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలి



ఎంపీపీ సంజీవరెడ్డిని సన్మానించిన అధికారులు

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూసి ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి పేదవారికి చేరాలన్నారు. బండిఆత్మకూరు వైద్యాధికారిణి డాక్టర్ భావన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మొదటగా ఏ.కోడూరు గ్రామం నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీపీ సంజీవరెడ్డి పదవీ రెండేళ్లు పూర్తి కావడంతో వివిధ శాఖల అధికారులు సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు రాగాల వెంకటరమణ, ముంతల మధురాణి, ఏఈ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



తంగడంచలో ఇంటి వద్ద మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



తమ్మడపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నందికొట్కూరు: నియోజకవర్గంలో పలు సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం మంగళవారం ముమ్మరంగా జరిగింది. పట్టణ, మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యుల ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలో ఇంటింటిని సందర్శించి మలేరియా, బీపీ, షుగరు, థైరాయిడ్, జ్వరం పరీక్షలు చేశారు. హెల్త్ క్యాంపుల్లో వైద్యం చేయించుకునేందుకు టోకన్లు పంపిణీ చేస్తున్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గతంలో ఫ్యామిలీ హెల్త్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కేసులు కాకుండా ఆరోగ్య సురక్షలో మరోసారి ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పూర్తి సర్వే చేస్తున్నారని పీహెచ్‌సీ వైద్యుడు సుబ్రమణ్యం తెలిపారు.

30 నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు

ఆత్మకూరు: ఈ నెల 30 నుంచి ప్రారంభిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 30న పిన్నాపురం, 3న కురుకుంద-1, 6న సున్నిపెంట-1, 7న నల్లకాల్వ, 9న శ్రీపతిరావుపేట, 10న కృష్ణాపురం, 12న వడ్లరామాపురం, 13న సున్నిపెంట-2, 16న బాపనంతపురం, 18న కురుకుంద-2, 19న ముష్టపల్లి, 20న సున్నిపెంట-3, 26న కరివేన, 27 సున్నిపెంట-4, 28న సిద్దాపురంలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రతి కుటుంబంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తాం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబంలోని సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని బైర్లూటి వైద్యాధికారి గోపాల్, పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో మంగళవారం ఇంటింటి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆశావర్కర్లతో ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ రమణమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే 90 శాతం పూర్తి

మహానంది: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇప్పటికీ 90శాతం సర్వే పూర్తయ్యిందని బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భావన తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మహానంది మండలంలోనూ సర్వే చురుగ్గా సాగుతున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు.